సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



..ముత్యాల తలంబ్రాలు

శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో సేవల ద్వారా భక్తులకు చేరవేస్తోంది. నేటివరకు బుకింగ్ గడువు. 8లో



అగ్గితో బుగ్గి కాకుండా..

వేసవిలో అడవులు కార్చిచ్చుతో తగలబడకుండా అటవీ శాఖ అధికారులు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. పాక్షికంగా మబ్బులు పట్టవచ్చు



న్యూస్‌రీల్

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు ఆదివారం విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తలనీలాలు సమర్పించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ అనుదీప్

బూర్గంపాడు: మార్చి 30న గోవాలో జరిగిన ఆసియాన్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన బూర్గంపాడు కేజీబీవీ విద్యార్థినులను కలెక్టర్ అనుదీప్ అభినందించారు. ఆదివారం పతకాలు సాధించిన విద్యార్థినులు కె.నందిని, బి.వర్షిణి, కె.వర్షిత, డి.మనస్విత, కె.రుతిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, జీసీడీఓ అన్నామని, కేజీబీవీ ప్రత్యేక అధికారి సుశీల, కరాటే మాస్టర్ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం, ఇల్లెందులలో సింగరేణి సంస్థ ప్రభుత్వానికి సరెండర్ చేసిన భూములలో ఇళ్లు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్న ప్రజలు క్రమబద్ధీకరణ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2020, జూన్ 2వ తేదీ లోపు ఇళ్లు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్న ప్రజలు క్రమబద్ధీకరణ దరఖాస్తులకు అర్హులని తెలిపారు. గతంలో క్రమబద్ధీకరణకు తిరస్కరణకు గురైనవారు సైతం తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించినట్లు తెలిపారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు క్రమబద్ధీకరణకు జీఓ నంబర్ 58, 59 ద్వారా క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవాలని, ఈనెలాఖరు వరకు గడువు ఉందని వివరించారు. 125 గజాల వరకు జీఓ నంబర్ 58 ప్రకారం ఉచితమని, 125 కంటే ఎక్కువ స్థలం ఉంటే నామమాత్రం రుసుంతో క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. దరఖాస్తుతోపాటు ఇంటిపన్ను, కరెంటుబిల్లు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పాస్‌ఫొటో, ప్రాపర్టీఫొటో, మొబైల్‌నంబరు, ప్రాపర్టీ హద్దుల జిరాక్స్ ప్రతులతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

దారి తప్పుతున్న గురువులు!

బాలికలను వేధిస్తున్న కొందరు ఉపాధ్యాయులు

- సంఘటనలు జరిగినప్పుడే అధికారుల హడావిడి
- ఆ తర్వాత పట్టించుకోని విద్యా, పోలీస్ శాఖలు
- పాఠశాలల్లో నామమాత్రంగానే బాలికా క్లబ్‌లు, కమిటీలు
- నిత్యం విద్యార్థినులు, తల్లిదండ్రులకు మనోవేదన



కొత్తగూడెంఅర్బన్: విద్యాసంస్థలకు రాకపోకలు సాగించే క్రమంలో ఆకతాయిల వేధింపులతో విద్యార్థినులు మనోవేదనకు గురవుతున్నారు. నిత్యం భయపడుతూనే పాఠశాల, కళాశాలలకు వెళ్లివస్తున్నారు. బాలికల తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఉపాధ్యాయులు కూడా వేధింపులకు పాల్పడుతుండటంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు మరింత వేదనాభరితులవుతున్నారు. దారి చూపాల్సిన గురువులు దారి తప్పి, అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటే ఎవరికీ చెప్పుకోలేక తమలో తామే కుమిలిపోతున్నారు. గత రెండు నెలల కాలంలో జిల్లాలో ఇలాంటివే మూడు ఘటనలు వెలుగుచూశాయి. ఇంకా వెలుగుచూడనివి ఎన్నో ఉంటున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాలికల సమస్యలను చర్చించి, పరిష్కరించాల్సిన బాలికల క్లబ్‌లు, కమిటీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. కార్యాచరణ రూపొందించి అమలు చేయడం, అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు ఏమీ నిర్వహించడంలేదు. దీంతో వేధింపులకు అడ్డుకట్ట పడటంలేదు.

కమిటీలు నామమాత్రమేనా..?

జిల్లాలోని 94 పాఠశాలల్లో 2022 అక్టోబర్‌లో బాలికల క్లబ్‌లు, కమిటీలు ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎంలు చైర్మన్‌గా, ఒక టీచర్ కన్వీనర్‌గా, హై స్కూల్‌లో ప్రతి తరగతి గది నుంచి ఇద్దరు బాలికలు, స్థానిక మహిళా పోలీసు, షీటీమ్ సభ్యులు.. ఇలా 10 నుంచి 12 మంది కమిటీలో సభ్యులు ఉన్నారు. కమిటీ సమావేశాలు తరచూ నిర్వహించి, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలి. బాలికలకు అవగాహన కల్పించేందుకు బాలికల సంరక్షణకు ఏర్పాటు చేసిన 181, 100, 1098 టోల్‌ఫ్రీ నంబర్లను పాఠశాలల ఆవరణలలో ప్రదర్శించాలి. గతేడాది అక్టోబర్ 21వ తేదీ నుంచి 2023 ఫిబ్రవరి 10వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని కార్యాచరణ రూపొందించారు. కానీ కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ఏదైనా ఘటనలు జరిగినప్పుడు హడావిడి చేయడం కాకుండా చిత్తశుద్ధితో బాలికా సంరక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. జిల్లా విద్యాశాఖలో ఏర్పాటు చేసిన చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు, బాలిక కమిటీలు క్రియాశీలకంగా పనిచేసేలా చూడాలని పేర్కొంటున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇవి పాటించాలి..

- విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే అసభ్యకరంగా ప్రవర్తిస్తే విద్యార్థినులు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నెలకొంటోంది. గురువుల నడవడికపై, ముఖ్యంగా రిమార్కు ఉన్నవారిపై జిల్లా విద్యాశాఖాధికారులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.
- చట్టాలపై విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు కల్పించి, దాడులు, వేధింపుల నివారణకు కృషి చేయాలి. పోక్సో తదితర చట్టాలు, శిక్షల గురించి వివరించాలి. పాఠశాల, కళాశాలకు వెళ్తున్న విద్యార్థినులు భద్రంగా ఇంటికి తిరిగివస్తారనే ధైర్యం తల్లిదండ్రులకు కల్పించాలి.
- బాలికల ఎదుగుదలతో పాటుగా వచ్చే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలపై అవగాహన, రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, కమ్యూనికేషన్ స్కిల్స్, లింగసమానత్వం, లైంగికదాడులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజంలో మంచీ చెడుపై అవగాహన కల్పించాల్సిన అవసరముంది.
- పాఠశాలలకు సంబంధించి మండల స్థాయిలో వేసే కమిటీలలో ఉపాధ్యాయులతో పాటుగా పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉండే విధంగా చూడాలి. 15 రోజులకు ఒక్క స్కూల్ విజిట్ చేసి సమస్యలు తెలుసుకోవాలి. సంఘటన జరిగినప్పుడే కాకుండా తరుచుగా అవగాహన సదస్సులు జరపాలి.
- గతంలో జరిగిన చింతవొర్రె ఘటనలో ఫిర్యాదు ఆలస్యమైనందుకు ఎంఈఓను సస్పెండ్ చేయడంతోపాటు డీఈఓకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఆలస్యం కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేసే విధంగా చూడాలి.
- కాంప్లెక్స్‌ల వారీగా జడ్జి, షీ టీమ్, చైల్డ్ లైన్‌తో ప్రతినిధులతో సదస్సులు జరపాలి. డయల్ 100 గురించి వివరించాలి.
- విద్యాసంస్థల్లో, బయట ఎవరైనా వేధింపులకు పాల్పడితే విద్యార్థినులు వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు తెలియజేసే విధంగా చూడాలి.


జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు..

- కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో లక్ష్మీదేవిపల్లి మండలం చింతవొర్రెలో జరిగిన ఘటనలో ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్‌కు శిక్షపడింది. ఆ తర్వాత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామంటూ అధికారులు కొద్దిరోజులు హడావిడి చేసి వదిలివేశారు.
- మార్చి 15న జూలూరుపాడు మండలం పాలకొల్లు హై స్కూల్‌లో ఉపాధ్యాయుడు ఎస్.రామారావు, బాలికలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చేశారు. మరుసటి రోజు రామారావును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.
- అశ్వారావుపేట మండల కేంద్రంలోని సూర్య పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికను ప్రిన్సిపాల్ పోతుల రాంప్రభు అలియాస్ రాంబాబు మూడు నెలల పాటు వేధించాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసు స్టేషన్‌లో ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదైంది.
- పాల్వంచ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో గత బుధవారం వీడ్కోలు కార్యక్రమం జరిగింది. కళాశాల అధ్యాపకురాలు దుర్భాషలాడటంతో విద్యార్థినులు కన్నీంటి పర్యంతమయ్యారు. వీడ్కోలు కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి, అధ్యాపకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమిటీలు, క్లబ్‌ల పని తీరు మెరుగుపరుస్తాం



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, బాలికలు క్లబ్‌ల పని తీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే నిందితులపై చర్యలు చేపడుతున్నారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూస్తున్నాం. పాఠశాలల్లో చట్టాలపై అవగాహన సదస్సులు ఎక్కువ సంఖ్యలో నిర్వహిస్తాం. –ఇ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాధికారి



నిశ్చింతగా పరీక్షలు రాయండి

- విద్యార్థులకు కలెక్టర్ అనుదీప్ సూచన
- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి విద్యార్థులు నిశ్చింతగా పరీక్షలు రాయాలని, మంచి గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించి జిల్లాకు పేరు తేవాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. సోమవారం వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా జిల్లాలోని 72 పరీక్ష కేంద్రాల్లో 12,492 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఓ ప్రకటన చేశారు. సంవత్సర కాలంపాటు ఎంతో కృషి, పట్టుదలతో పరీక్షలకు సన్నద్ధమయ్యారని, ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు అదనపు బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను విద్యార్థులతో పాటు పర్యవేక్షణ అధికారులు కూడా తీసుకురావొద్దని పేర్కొన్నారు. పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అత్యవసర వైద్య కేంద్రాలు, సురక్షిత తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు కల్పించామని వివరించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ దరఖాస్తులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. అన్నిప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అందని వేతనాలు

- 2019–20లో విద్యావలంటీర్లకు మూడు నెలల జీతం బాకీ
- జిల్లాలో 574 మందికి అందాల్సిన రూ.1.48కోట్లు
- ఉద్యోగం కూడా తొలగించడంతో వలంటీర్ల వెతలు



ఇల్లెందు మండలం తీగలంచ ఎంపీపీఎస్‌లో విద్యార్థులతో విద్యావలంటీర్ (ఫైల్)

ఇల్లెందు: జిల్లాలో నాలుగేళ్ల క్రితం పనిచేసిన విద్యావలంటీర్ల మూడు నెలల వేతనాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం కూడా ముగింపు దశకు వచ్చింది. అయినా విద్యాశాఖ పట్టించుకోవడంలేదు. ఈ–కుబేర్‌లో నిధులు ఆగిపోయినట్లు చెబుతున్న విద్యాశాఖ అధికారులు, వాటి విడుదలకు చర్యలు తీసుకునేదెవరనే విషయమై స్పష్టత ఇవ్వడంలేదు. అధికారులు సకాలంలో బిల్లులు పంపించకపోవడంతో వేతనాలు నిలిచిపోయినట్లు సమాచారం. నిధుల విడుదల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు డీఈఓ సోమశేఖరశర్మ చెబుతున్నా కదలిక మాత్రం లేదు. ఉద్యోగం కూడా తొలగించడంతో మూడేళ్లుగా విద్యావలంటీర్లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ.36 వేలు

జిల్లాలో 2019–20లో జిల్లాలో 17 మండల పరిషత్ పాఠశాలల్లో 574 మంది విద్యావలంటీర్లు పని చేశారు. వీరికి ఆ విద్యాసంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో వలంటీర్‌కు నెలకు రూ. 12 వేల చొప్పున మూడు నెలలకు రూ. 36 వేలు చెల్లించాల్సి ఉంది. ఇలా జిల్లాలోని 574 మందికి సుమారు రూ. 1.48 కోట్లు బకాయిలు పడ్డారు.

టోకెన్ నంబర్ ఇచ్చారు కానీ..

2022, అక్టోబర్ 10 నిధుల విడుదల చేస్తున్నట్లు అధికారుల నుంచి సమాచారం వచ్చింది. అదే నెల 20న ఎస్టీఓలో టోకెన్ నంబర్ 37629417 కేటాయించారు. కానీ నిధులు విడుదల చేయకుండా రాష్ట్ర విద్యాశాఖ తొక్కిపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రిలీజ్ చేస్తే వలంటీర్ల అకౌంట్లలో జమ అయ్యే అవకాశం ఉంది. కాగా దుమ్ముగూడెం మండల పరిషత్ పాఠశాలలో 24 మంది వలంటీర్లు, భద్రాచలంలో 8 మంది, బూర్గంపాడు పరిధిలో 17 మంది, చర్లలో ఏడుగురు, మణుగూరులో ఏడుగురు, పినపాకలో 86 మంది, అశ్వాపురంలో 18 మంది, కొత్తగూడెంలో 95 మంది, చంద్రుగొండలో 8 మంది, ములకలపల్లిలో 9 మంది, జూలూరుపాడులో ఒక్కరు, పాల్వంచలో 19 మంది, గుండాలలో 53 మంది, టేకులపల్లిలో 9 మంది, ఇల్లెందులో 19 మంది, అశ్వరావుపేటలో 102 మంది, దమ్మపేటలో 50 మంది పని చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఎన్నో దఫాలు అధికారులకు మొర పెట్టుకున్నాం. కార్యాలయాల చుట్టు తిరిగాం. గతేడాది అక్టోబర్ నెలలో నిధులు విడుదలైనట్లు ఎస్టీఓ కార్యాలయంలో టోకెన్ నంబర్ కేటాయించారు. అయినా అకౌంట్లలో జమ కాలేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వేతనాలు విడుదల చేయాలి.
– వి. అశోక్, విద్యావలంటీర్, ఎంపీపీఎస్ తీగలంచ, ఇల్లెందు మండలం

రామా.. లోటు పూడ్చేదెలా?

- నవమి ఉత్సవాలకు రూ.2.30 కోట్లకు పైగా ఖర్చు
- అన్ని మార్గాల్లో దేవస్థాన ఆదాయం రూ.1.50 కోట్లలోపే..
- శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంపై ఆర్థిక భారం
- ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి జమ చేస్తే గట్టెక్కినట్లే..



భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి వారి ఆలయం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ ప్రశాంతంగా ముగియటంతో దేవస్థానంతోపాటు జిల్లా అధికార వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. ఇక ఆలయ వర్గాలు ఆదాయ, వ్యయాల పద్దులపై దృష్టి సారించాయి. పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం సందర్భంగా భారీ ఎత్తున ఖర్చు చేయడంతో దేవస్థానం ఖజానాకు కొంత మేర నష్టం వచ్చే అవకాశాలు ఉన్నట్లు లెక్కలు తేల్చిచెబుతున్నాయి.

ఆదాయం రూ.కోటిన్నర లోపే..

ఉత్సవాల అనంతరం ఆలయానికి అన్ని మార్గాల ద్వారా వచ్చే ఆదాయం రూ.కోటిన్నర లోపే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా హుండీ ద్వారా దేవస్థానానికి అధికంగా ఆదాయం వస్తుంది. ప్రతి నెలా సుమారు రూ.60 లక్షల వరకు సమకూరుతుంది. కానీ నవమి ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో మరో రూ.30 లక్షలు అధికంగా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆన్‌లైన్‌లో కల్యాణం, పట్టాభిషేక టిక్కెట్ల విక్రయాలు, లడ్డూలు, ముత్యాల తలంబ్రాల విక్రయాల ద్వారా మరో రూ. 50 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా చూసుకుంటే రూ. కోటిన్నర లోపే రామయ్య ఉత్సవ ఆదాయం కనిపిస్తుంది. దీంతో మరో రూ.80 లక్షల లోటు దేవస్థాన ఖజానాకు స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రభుత్వం రూ.కోటి నేరుగా జమ చేస్తేనే..

ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించాలని కోరుతూ కలెక్టర్ అనుదీప్ ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ. కోటి విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులు నేరుగా దేవస్థానం ఖాతాకు వస్తే దేవస్థానం ఉత్సవాల ఖర్చులో గట్టెక్కినట్లే. ఉత్సవాల నిర్వహణలో భాగంగా రెవెన్యూ, పోలీసు, వైద్య, ఇరిగేషన్ ఇతర శాఖలకు ఖర్చు నిమిత్తం ప్రతిఏటా దేవస్థానం రూ.25 లక్షలను, గ్రామపంచాయతీ మరో రూ.25 లక్షలను కేటాయించి రెవెన్యూ శాఖకు అందచేస్తుంది. ఇందుకు దేవస్థానం తరఫున రూ.10 లక్షలను అడ్వాన్స్‌గా ప్రభుత్వ జీఓ విడుదల కాకముందే చెల్లించారు. ప్రభుత్వం విడుదల చేసే కోటి రూపాయల నిధులు ఉత్సవాల నిర్వహణకు కలెక్టర్ చేతుల మీదుగా అందచేస్తే దేవస్థానానికి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. సరాసరి దేవస్థానం ఖాతాలో జమచేస్తే దేవస్థానం నష్టం నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయి. దీనికి తోడు ప్రతి ఏడాది వీవీఐపీలు, ప్రజాప్రతినిధుల నిమిత్తం రెవెన్యూ అధికారులు తీసుకుంటున్న టికెట్ల ఆదాయం దేవస్థానానికి అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇది కూడా జమచేస్తే కొంత ఆదాయం లభిస్తుందనే వాదనలను దేవస్థానం వర్గాలు వినిపిస్తున్నాయి.

ఆలయంపై ఉత్సవాల భారం..

ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాలు జరిగిన ప్రతిసారి దేవస్థానంపై పెను భారం పడుతోంది. ఉత్సవాల నిర్వహణకు ఇతర జిల్లాల నుంచి బందోబస్తుకు పెద్ద ఎత్తున తరలిస్తున్న పోలీసులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది వసతికి పెద్ద ఎత్తున ప్రైవేట్, ప్రభుత్వ కాటేజీలు, లాడ్జీలు, ఫంక్షన్‌హాళ్లు కేటాయిస్తున్నారు. కొద్దిమేర ఉన్న గదులకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో స్వామివారి ఉత్సవాలను కనులారా వీక్షించాలని మనస్సులో ఉన్న సామాన్య భక్తులు భద్రాచలం వచ్చి ఉండి ఉత్సవాలను వీక్షించే అవకాశం లేకుండాపోతోంది. గోదావరి ఒడ్డున, మిథిలా స్టేడియం, కరకట్ట దిగువన భక్తులకు సరిపడా మౌలిక వసతులను కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారు. ట్రాఫిక్ సమస్య ప్రతి ఏడాది షరామామూలుగా మారింది. దేవస్థానంలో వసతి సమస్యను పరిష్కరించటంతో పాటుగా భక్తులు పెద్ద ఎత్తున భద్రాచలం తరలివచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఏడాది రూ.3 కోట్లను విడుదల చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఖర్చు రూ.2.30 కోట్ల పైమాటే

పన్నెండేళ్లకోసారి జరిగే పుష్కర సామ్రాజ్య మహా పట్టాభిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. చలువ పందిళ్ల నిర్మాణం, లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు, స్వాగత ద్వారాలు, తాత్కాలిక కూలర్లుతోపాటు ఇతర పనుల నిమిత్తం సుమారు రూ.కోటి 25 లక్షల పనులకు టెండర్లు నిర్వహించి ఖర్చు పెట్టారు. ఇక సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా దేశంలో నాలుగు దిక్కుల నుంచి సముద్ర, నది, పుష్కరిణీల పుణ్య తీర్థాలను తీసుకొచ్చేందుకు నాలుగు దిక్కుల వైదిక బృందాన్ని పది రోజుల పాటు పంపించారు. పలు దివ్యక్షేత్రాల నుంచి 108 మంది రుత్విక్కులను భద్రాచలానికి పిలిపించారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ఇక్కడే వీరికి బసతో పాటుగా పలు సౌకర్యాలను కల్పించారు. ప్రత్యేకంగా రెండు యాగశాలలను నిర్మించారు. ఇలా పూజాదికార్యక్రమాలతోపాటు స్వామి వారికి సమర్పించిన పట్టువస్త్రాలకు అన్నింటికి కలిపి సుమారు రూ.40 లక్షల వరకు, భద్రాచలంలో, పర్ణశాలలో జరిగిన ఇతర పనులకు రూ.60 లక్షల వరకు ఖర్చు తేలే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా సుమారు రూ.2.25 కోట్ల వరకు ఖర్చయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వ వివక్ష

ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నామ నాగేశ్వరరావు

చంద్రుగొండ : నిధుల కేటాయింపులో రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఖమ్మం ఎంపీ, నామ నాగేశ్వరరావు విమర్శించారు. మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలోని లక్ష్యాగార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన మండల శాఖ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం రాకముందు, వచ్చిన తరువాత గ్రామాలు ఎలా ఉన్నాయో ప్రజలకు తెలుసని అన్నారు. మన దగ్గర ఉన్న మిషన్ భగీరథ పథకాన్ని చూసి కేంద్రం హర్ ఘర్‌కు జల్ పథకాన్ని రూపొందించిందని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమవుతుందని అన్నారు. సొంతస్థలం ఉన్న ప్రతి పేదకుటుంబానికి పక్కా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం డబ్బులు ఇస్తుందని తెలిపారు. గత ఎన్నికల్లో తనకు అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి 32 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, ఈ సారి రెట్టింపు మెజారిటీ ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. తొలుత ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పార్టీ జెండాను అవిష్కరించారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతుబంధు జిల్లా సమన్వయకర్త రావు జోగేశ్వరరావు, దమ్మపేట, చంద్రుగొండ మండలాల నాయకులు జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, దార వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, బోయినపల్లి సుధాకర్‌రావు, మెడా మోహన్‌రావు, ఉప్పతల ఏడుకొండలు, ఎస్డీ రసూల్, నల్లమోతు వెంకటనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ముంగిట్లోకి ముత్యాల తలంబ్రాలు..

ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా భక్తులకు చేరవేత

- ఖమ్మం రీజియన్‌లో 5,022 మంది బుకింగ్
- సంస్థకు వచ్చిన ఆదాయం రూ.5,82,552
- తలంబ్రాల బుకింగ్‌కు నేటి వరకు అవకాశం



సీతారాముల ముత్యాల తలంబ్రాలు (ఫైల్)

చుంచుపల్లి : శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ లాజిస్టిక్ సేవల ద్వారా ఇంటి వద్దకే ముత్యాల తలంబ్రాలు అందించేలా ఏర్పాట్లు చేశారు. గతేడాది మాదిరిగా ఈసారి కూడా కూడా ఈ సౌకర్యం కల్పించారు. ఇందులో భాగంగా రూ.116 చెల్లించి వివరాలు నమోదు చేసుకున్న భక్తులకు ముత్యాల తలంబ్రాలను నేరుగా అందిస్తారు. గత నెల 17 నుంచి ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు ఆరు డిపోల పరిధిలో లాజిస్టిక్ కేంద్రాల ద్వారా బుకింగ్‌కు మొదలైంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని భక్తుల నుంచి మంచి స్పందన లభించింది. అధికారులు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. గత నెల 30న బుకింగ్ గడువు ముగిసేనాటికి 3,807 మంది తలంబ్రాల కోసం నగదు చెల్లించగా, రూ. 4,41,612 ఆదాయం వచ్చింది. భక్తుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నెల 3 వరకు బుకింగ్ గడువు పెంచారు. కాగా లాజిస్టిక్ ద్వారా బుక్ చేసుకున్న భక్తులందరికీ రెండు, మూడు రోజుల్లో తలంబ్రాలు పంపిణీ చేయనున్నారు. గతేడాది కంటే ప్రస్తుతం శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలకు భక్తుల నుంచి మరింత స్పందన రావడంతో ఆర్టీసీ అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంతో ఆర్టీసీ కార్గో చేసుకున్న ఒప్పందంలో భాగంగా ముత్యాల తలంబ్రాలను సేకరించి భక్తులకు చేరవేస్తున్నారు.

ఎంతో విశిష్టత

భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే నవమి వేడుకల్లో ఉపయోగించే ముత్యాల తలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉన్నది. ఈ తలంబ్రాలను శుభకార్యాల్లో అక్షింతలుగా వాడితే సాక్షాత్తు రాముల వారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మిక. అంతేకాక రైతులు తమ పొలాల్లో వ్యవసాయ పనులు మొదలుపెట్టే ముందు ఈ తలంబ్రాలు చల్లే ఆనవాయితీ ఉంది. ఈకారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రామభక్తులు ముత్యాల తలంబ్రాల కోసం ఆసక్తి కనబరుస్తారు. కానీ కల్యాణోత్సవానికి అందరూ హాజరుకాలేని నేపథ్యాన టీఎస్ ఆర్టీసీ కార్గో సేవల ద్వారా తలంబ్రాలను గత ఏడాది నుంచి భక్తుల ఇంటికి చేరవేస్తోంది.

రీజియన్‌కు రూ.5,82,552 ఆదాయం

ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల్లో శనివారం వరకు 5,022 బుకింగ్‌లు నమోదుకాగా, రూ.5,82,552 ఆదాయం సమకూరింది. సోమవారం వరకు బుకింగ్‌కు అవకాశం ఉండటంతో ఇంకా ఆదాయం పెరగనుంది. రీజియన్‌లో ఇప్పటివరకు ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి డిపోలు అత్యధిక ఆదాయాన్ని రాబట్టాయి. మార్చి 30, 31, తేదీలతో పాటు ఈ నెల 1న కూడా భక్తులు భారీగా తలంబ్రాలను బుకింగ్ చేసుకున్నారు. కేవలం మూడు రోజుల్లో ఆర్టీసీకి రూ.1,89,544 ఆదాయం వచ్చింది. మార్చి 30న 419 బుకింగ్‌లు, మార్చి 31న 582 బుకింగ్‌లు, ఈ నెల 1న 633 బుకింగ్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా 1,795 బుకింగ్‌ల ద్వారా రూ.2,08,220 ఆదాయం పొంది సత్తుపల్లి డిపో మొదటిస్థానంలో నిలిచింది. మణుగూరు డిపో అత్యల్పంగా 317 బుకింగ్‌ల ద్వారా రూ.36,772 ఆదాయంతో చివరి స్థానంలో ఉంది.

ఆర్టీసీ బస్ డిపోల వారీగా బుకింగ్ వివరాలు..

డిపో	బుకింగ్‌లు	ఆదాయం (రూ.ల్లో)
సత్తుపల్లి	1,795	2,08,220
ఖమ్మం	1,123	1,30,268
కొత్తగూడెం	989	1,14,724
భద్రాచలం	416	48,256
మధిర	382	44,312
మణుగూరు	317	36,772



ఆర్టీసీ లాజిస్టిక్‌లో ముత్యాల తలంబ్రాలు బుకింగ్ చేసుకున్న భక్తులు

వారం క్రితం బుకింగ్ చేసుకున్నాం



శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈసారి భద్రాచలం వెళ్లలేకపోవడంతో ఆర్టీసీ కార్గో ద్వారా తలంబ్రాలు తెప్పించుకోవాలని వారం క్రితం బుక్ చేశా. ఆర్టీసీ కల్పించిన ఈ సదుపాయం ఎంతో బాగుంది. రాముడి కల్యాణ అనంతరం ఇంటికే వస్తాయి.

– చందా కైలాష్, కొత్తగూడెం

మంచి స్పందన వచ్చింది



శ్రీరామనవమికి భద్రాచలం వెళ్లేందుకు వీలుపడని భక్తుల కోసం తలంబ్రాలు చేరవేసే సౌకర్యాన్ని ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా కల్పించాం. పది రోజుల పాటు బుకింగ్ జరగగా భక్తులు నుంచి మంచి స్పందన లభించింది. గతేడాదితో పోలిస్తే ఎక్కువ మంది తలంబ్రాలు బుక్ చేసుకున్నారు.

– బి.వెంకటేశ్వరరావు, కొత్తగూడెం, డిపో మేనేజర్

తల్లిదండ్రుల తంటాలు..

గురుకుల పాఠశాలలో పిల్లలను కలిసేందుకు వచ్చి అవస్థలు



మండుటెండలో విద్యార్థుల తల్లిదండ్రులు

మణుగూరుటౌన్: మణుగూరు మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను ఆదివారం చూసిపోవడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు నానా అవస్థలు పడ్డారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఓ ప్రైవేట్ భవనంలో ఉన్న ఈ పాఠశాలలో చదువుతున్న సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి ఉదయం 8 గంటలకు పాఠశాల గేటు ముందుకు వచ్చారు. తీరా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిల్లలను కలవకూడదని గేట్ తీయలేదు. దీంతో వారు ఎండలో మధ్యాహ్నం వరకు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ఉండటం వల్ల పిల్లల తల్లిదండ్రులు వారికి కావాల్సిన వస్తువులు కొనిచ్చిపోవాలని వచ్చారు. సుమారు 100 నుంచి 150 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన తల్లిదండ్రులకు వారి పిల్లలను కలవనీయకుండా వారిని రోడ్డుపైన ఎండలో ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరినీ అనుమతించడం లేదని, ఫ్లూ కేసులు పెరుగుతున్నందున తల్లిదండ్రులను అనుమతించొద్దని అధికారులు ఆదేశించారని చెప్పారు. పెద్దసంఖ్యలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని తెలియడంతో సాయంత్రం 3 గంటలకు అనుమతించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన పేదలు



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

పాల్వంచ: పట్టణంలోని సీతారాంపట్నం సబ్ స్టేషన్ ఏరియాలో గల ప్రభుత్వ భూమిలో ఆదివారం పలువురు పేదలు గుడిసెలు వేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏకే రమేష్ మాట్లాడుతూ.. గతంలో నూతన కలెక్టరేట్ వెనుక భాగంలో ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుంటే అధికారులు అక్కడ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మభ్యపెట్టారన్నారు. ఇటీవల నవభారత్ ఏరియాలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు అన్ని పేదలకు కాకుండా ఇళ్లు ఉన్న వారికే ఇచ్చారని ఆరోపించారు. దశాబ్దాల కాలంగా ఇళ్లు లేని పేదల కోసం తమ పార్టీ పోరాటం చేస్తోందని, ఇక్కడ ప్రభుత్వ భూమి ఉందని గుర్తించి పేదలు గుడిసెలు వేసుకుంటున్నారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి దొడ్డా రవి, కె.సత్య, వాణి, ఎస్కే రహీం, కాంతి, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న కె.వెంకటేశ్వర్లు

కొత్తగూడెంరూరల్: మహనీయుల త్యాగాలను నేటి తరాలు తెలుసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సురేందర్, ఎక్సైజ్‌శాఖ ఈఎస్ జానయ్య, బీసీ సంఘం నాయకులు రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్‌-2 బస్తీలో చోరీ

ఇల్లెందు: పట్టణంలోని నంబర్‌-2 బస్తీలో చోరీ జరిగిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన బానోతు పద్మ.. ఇంటికి తాళం వేసి ఊరుకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి తాళం పగులకొట్టి 3 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆ పక్కనే గల ఇంటి ఆవరణలో నిలిపి ఉన్న బైక్‌ను కూడా ఎత్తుకెళ్లారు. వారు ఉదయం లేవగానే ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్ కనిపించకపోవటం, పద్మ ఇంటి తాళాలు పగులకొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ బి.రాజు ఆదివారం ఉదయం చోరీ జరిగిన ఇంటిని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు

పాల్వంచరూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడిపై పోలీసులు ఆదివా రం కేసు నమోదు చేశారు. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కటుకోజు విష్ణు చారి మార్చి 31వ తేదీన రోడ్డు దాటుతున్న క్రమంలో భద్రాచలం నుంచి పాల్వంచ వైపు వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణుచారి కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. విష్ణు చారి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు షరీఫ్ ఉద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

గంజాయి స్వాధీనం



గంజాయిని చూపుతున్న పోలీసులు

పాల్వంచ: అక్రమంగా కారులో తరలిస్తున్న గంజాయిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం వైపు నుంచి కారు అనుమానాదాస్పదంగా వస్తున్నట్లు గుర్తించిన ఫారెస్ట్ రేంజర్ అనిల్‌కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రెజీనా స్కూల్ వద్ద మాటు వేసి కారును ఆపారు. కారు వెనుక భాగంలో ఉన్న 158 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.31 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా, కారును ఆపిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. గంజాయిని ఎక్కడి నుంచి సరఫరా చేస్తున్నారనేది తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

జ్యోతిష్యుడికి సత్కారం



విజయమారుతిశర్మను సత్కరిస్తున్న దృశ్యం

దమ్మపేట: జ్యోతిష్యుడు కామవరపు విజయమారుతిశర్మకు జ్యోతిష్య, వాస్తు వేద పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సత్కారం చేశారు. ఏపీలోని ఒంగోలు పట్టణంలో తేజస్వి జ్యోతిష్య వాస్తు వేద పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో పంచాంగ రజతోత్సవ వేడుకలు – ఉగాది పురస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. దమ్మపేట గ్రామానికి చెందిన విజయమారుతిశర్మకు 'స్మార్త విద్యాభూషణ్' బిరుదు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఫణిశశాంకశర్మ, నీలం పూర్ణమోహన్, ప్రసాద్‌శర్మ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే ప్రజలకు మేలు



లబ్ధిదారులతో సెల్ఫీ తీసుకుంటున్న నిర్మలకిశోర్

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలతోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని బీజేపీ అనుబంధ మహిళా మోర్చా ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలకిశోర్ పేర్కొన్నారు. జాతీయ మహిళా మోర్చా ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో కలిసి కోటి సెల్ఫీలు తీసుకునే కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండలం బిల్లుడుతండా పంచాయతీ హచ్చతండాలో ఆదివారం రాత్రి లబ్ధిదారులతో సెల్ఫీలు తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. వాంకుడోత్ పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నాగపరిమళ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోటేశ్వరి, జ్యోతి, బీజేపీ మండల అధ్యక్షుడు డి.బాలాజీ, సురేశ్, రాజు, బాబూరావు, హత్తీరాం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులు చెప్పేందుకే 'సమ్మేళనం'



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, తాతా మధు, వెంకటవీరయ్య తదితరులు

- పల్లెల్లో రచ్చబండ చర్చలు పెట్టండి
- ధర్మం, న్యాయం వైపే సత్తుపల్లి ప్రజలు
- బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు
- ఆత్మీయ సమ్మేళనం సభలో ఎంపీలు బండి, వద్దిరాజు

సత్తుపల్లి: చేసిన మంచి పనులు చెప్పకపోతే పార్టీకే నష్టమని, వాటి గురించి వివరించేందుకే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలం గంగానంలో ఆదివానం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఊరికి ఏదో ఒక కార్యక్రమం చేపట్టాలన్నదే తన అభిమతమని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఏ కార్యక్రమం చేపట్టినా సక్సెస్ అయ్యేవరకు కష్టపడతారని అన్నారు. మరో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, రాష్ట్రంలో రూ.4.50 లక్షల కోట్ల బడ్జెట్‌ను రైతుల కోసం ఖర్చు చేశారని చెప్పారు. కేసీఆర్ రుణం తీర్చుకోవాలంటే బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ కొట్టి దేశమంతా విస్తరించాలన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్తుపల్లి టన్నల్‌ను పూర్తి చేసి గోదావరి జలాలతో బేతుపల్లి పెద్ద చెరువు, లంకాసాగర్ ప్రాజెక్టులు నింపి ఈ ప్రాంత రైతులకు అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. ఈ నియోజకవర్గం రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందుందని, దీన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సైతం కొనసాగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఏదైనా సంక్షేమ పథకాలు పెట్టాలంటే సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను సంప్రదిస్తారని, జిల్లాలోనే సీనియర్ ఎమ్మెల్యేగా అన్ని విషయాలు చర్చించి పరిష్కరిస్తారని చెప్పారు.

ధర్మం, న్యాయం వైపే సత్తుపల్లి ప్రజలు

సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ.. సత్తుపల్లి ఎమ్మెల్యేగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారసత్వాన్ని కొనసాగిస్తూ అభివృద్ధిని రెట్టింపు చేశానని అన్నారు. తనకు కోడిపందేలు ఆడించే అలవాటు లేదని, చెడు వ్యసనాలు లేవని, దళితబంధు ఎంపికలోనూ తాను జోక్యం చేసుకోలేదని వివరించారు. అలాంటి తనను ఒక సామాజిక వర్గానికి వ్యతిరేకమని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడో ఉండి నోటికొచ్చినట్టు విమర్శలు చేయడం కాదని, దమ్ముంటే తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ చేశారు. సత్తుపల్లి ప్రజలు ధర్మం, న్యాయం వైపే ఉంటారన్నారు. రాష్ట్రంలో అలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పల్లెల్లో రచ్చబండ చర్చలు పెట్టి పథకాలను మరింత ప్రజల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మొదట మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. సభలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేష గిరిరావు, ఎంపీపీ దొడ్డా హైమావతి, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, కూసంపూడి రామారావు, దొడ్డా శంకర్‌రావు, మోదుగు పుల్లారావు, యాగంటి శ్రీనివాసరావు, వనమా వాసు, ఎండీ రఫీ పాల్గొన్నారు.

'మహానంది'తో సత్కారం

ఇద్దరు ఖమ్మం జిల్లా వాసులకు పురస్కారాలు



సీతారాములును సత్కరిస్తున్న సాహితీ వేదిక ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: సాహితీ, కళా రంగాల్లో విశిష్ట సేవలందించిన ఖమ్మం నగరానికి చెందిన కోమాకుల సీతారాములు, ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పి.ఐలయ్య, రఘునాథపాలెం మండలానికి చెందిన గద్దల నాగరాజుకు మహానంది జాతీయ పురస్కారాలు లభించాయి. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల స్థాయిలో మహానంది జాతీయ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక చైర్మన్ డాక్టర్ రంగిశెట్టి రమేష్, సరస్వతీ మాత ఉపాసకులు డాక్టర్ దైవజ్ఞశర్మ, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత డాక్టర్ వంగాల శాంతి కృష్ణమాచార్య, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ యువజన అవార్డు గ్రహీత పోలోజు రాజ్‌కుమార్ వీరిరువురికీ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. కాగా, కవి, రచయిత అయిన కోమాకుల సీతారాములు గిరిజన సంక్షేమ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. సాహితీ, కళా రంగాలతో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ దశాబ్దాలుగా సేవలందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల నుంచి ఇప్పటి వరకు 68 అవార్డులను సొంతం చేసుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా మైనారిటీ శాఖ మైనారిటీ గురుకులాల విజిలెన్స్ అధికారిగా నియమించింది.

తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి మహేశ్ మృతి



మహేశ్ (ఫైల్)

చండ్రుగొండ: మండలంలోని గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాక మహేశ్ (33) ఆదివారం రాత్రి మృతి చెందారు. మహేశ్‌కు భార్య విజయ ఉన్నారు. మహేశ్ మృతదేహాన్ని జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, సర్పంచ్ కాక సీత, యూత్ కాంగ్రెస్ నాయకులు కేశబోయిన నర్సింహారావు, అంతటి రామకృష్ణ సందర్శించి నివాళులర్పించారు.

ఆటోలో నుంచి పడి మహిళ..



భవాని మృతదేహం

మణుగూరుటౌన్: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ అదుపుతప్పి కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని విజయనగరం గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. పినపాక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పస్తం భవాని (29) గిన్నెల వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో సరుకు తీసుకుని విజయనగరం అవతల ఆటోలో ఎక్కి వస్తోంది. ఆటోడ్రైవర్ అత్తర్ పాషా అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడం వల్ల భవాని ఆటోలోనుంచి అదుపుతప్పి రోడ్డుమీద పడిపోయింది. గమనించిన స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఐదుగురు పిల్లలున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, మోటార్ సైకిల్ ఢీ

దంపతులకు తీవ్ర గాయాలు

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు గ్రామంలో ఆదివారం కారు ఢీకొని మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం పట్టణానికి చెందిన కారు డ్రైవర్ అశోక్‌రెడ్డి మధిర మండలం మర్లపాడు నుంచి ఎర్రుపాలెం వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన లంకా మహేశ్, లంకా రవళి మోటారు సైకిల్‌పై ములుగుమాడు వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టడటంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న బ్లూకోల్ట్స్ పోలీస్ కానిస్టేబుల్ ఉపేందర్ ఘటనా స్థలానికి వచ్చి విచారించారు. స్థానికుల సాయంతో క్షతగ్రాతులను 108 అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరుగురిపై కేసు నమోదు

కల్లూరు: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్‌కు పాల్పడిన ఆరుగురు వ్యక్తులపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లూరు పట్టణంలోని ఎన్‌ఎస్‌పీలో ఢిల్లీ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య నడుస్తున్న క్రికెట్ మ్యాచ్‌లో బెట్టింగ్‌కు పాల్పడిన గోరంట్ల భాస్కర్, ఉబ్బన రంజిత్, గుగులోత్ కిరణ్, షేక్ రహీంపాషా, సరకుల సురేశ్, గొల్లమందల రవికాంత్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.52,250 నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.రఘు తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌ రావు

'కాళేశ్వరం' పెట్టుబడి ఎప్పుడో వచ్చేసింది

- గోదావరి నీటితో పుష్కలంగా దిగుబడులు
- కేసీఆర్‌ అనే అద్భుత దీపంతో బంగారు పంటలు: హరీశ్‌రావు

సిద్దిపేట జోన్‌: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గోదావరి నీటితో పుష్కలంగా పంటలు పండుతున్నాయని, 2014లో రూ. 30.28 కోట్ల విలువైన ధాన్యం దిగుబడి రాగా గతేడాది రూ. 344.16 కోట్ల విలువైన ధాన్యం పండిందని, ఈ లెక్కన కాళేశ్వరం కోసం పెట్టిన పెట్టుబడి ఎప్పుడో వచ్చిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం బంజరుపల్లి శివారులో బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేసీఆర్‌ అనే అద్భుత దీపం ఉందని.. దానివల్లే బంగారు పంటలు పండుతున్నాయన్నారు.

ధాన్యం కొనేందుకు కేంద్రానికి మనసు రాలేదు

మహారాష్ట్ర నుంచి 150 మంది రైతులు కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు రావడం రాష్ట్రానికి గొప్ప విషయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. డబుల్‌ ఇంజన్‌ సర్కార్‌ ఉన్న మహారాష్ట్రలోని షోలాపూర్‌లో నాలుగు రోజులకోసారి తాగునీరు వస్తుందని విమర్శించారు. రూ. 12 వేల కోట్ల అప్పును అదానీకి మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వానికి... రూ. 4 వేల కోట్లతో రైతులు పండించిన ధాన్యం కొనడానికి మనసు రాలేదని మంత్రి ఎద్దేవా చేశారు.

విపక్షాల ప్రచారం ప్రజలు నమ్మొద్దు..

బీజేపీ, కాంగ్రెస్‌ల గోబెల్స్‌ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, తెలంగాణ ఉద్యమ నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలు సాధించేలా బీఆర్‌ఎస్‌ పనిచేస్తోందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు రాష్ట్రంలో కరువు ఉండేదని... గంజి, అంబలి కేంద్రాలు, రైతుల ఆత్మహత్యలు ఉండేవని... ఇప్పుడు గోదావరి నీటితో తెలంగాణ పల్లెలు సస్యశ్యామలం అయ్యాయని పేర్కొన్నారు. పేపర్‌ లీకేజీపై నిరుద్యోగులు ఆందోళన పడొద్దని, 6 నెలల్లో 80 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ రోజాశర్మ, సుడా చైర్మన్‌ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింహ వాహనంపై సీతాపతి

వైఎస్సార్‌ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతిని చూసి తన్మయులై నమస్కరిస్తున్న భక్తులు



సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతి

ఒంటిమిట్ట: వైఎస్సార్‌ జిల్లా ఒంటిమిట్ట మండలం ఏకశిలానగరిలోని శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన ఆదివారం వటపత్రశాయి అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వేణుగాన నాథుడి గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. రాత్రి 8 గంటల నుంచి 9.30 గంటల వరకు సింహ వాహనంపై సీతాపతి విహరించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అభయమిచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు.

నేడు నవనీత కృష్ణాలంకారం :

శ్రీకోదండ రామాలయంలో సోమవారం ఉదయం 8.00 గంటలకు నవనీత కృష్ణాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రికి హనుమంత వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట పుర వీధుల్లో ఊరేగనున్నారు.

అడుగున్నర అందాల పెయ్యదూడ




డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం గ్రామానికి చెందిన గొలకోటి మాధవరావు ఇంట అడుగున్నర అందాల పెయ్యదూడ శనివారం రాత్రి జన్మించింది. ఫంక్షన్‌ సెట్టింగ్స్‌ ఆర్టిస్టు అయిన మాధవరావు వివిధ జాతుల ఆవులను పెంచుతుంటారు. 2019 అక్టోబర్‌ 28న ఓ కపిల ఆవుకు అరుదుగా ఉండే స్వర్ణ కపిల పెయ్య దూడ జన్మించి వార్తల్లోకి ఎక్కింది. ఆ స్వర్ణ కపిల ఆవు ఇప్పుడు 18 అంగుళాల పుంగనూరు పెయ్యదూడకు జన్మనిచ్చింది. ఈ అడుగున్నర అందాల పెయ్యదూడ అందర్నీ ఆకట్టుకుంటోంది.

టీడీపీలో నైరాశ్యం.. బాబు మౌన రాగం

175 స్థానాల్లో పోటీపై నోరు మెదపని వైనం

- సీఎంను ఓడించడానికి అందరూ ఏకం కావాలంటూ గగ్గోలు
- 50 నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేని దుస్థితి
- పలు స్థానాల్లో రెండో స్థానం కూడా సందేహమే
- చెప్పుకోవడానికి ఏమీ లేకే ఈ కొత్త రాగం



సాక్షి, అమరావతి: ఏపీలోని 175 శాసనసభ స్థానాల్లో అభ్యర్థులనే ఎంపిక చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్న చంద్రబాబు.. 'అసలు సినిమా ముందుంది'అంటూ డాంబీకాలు పలకడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును చూసి.. ఇది ట్రైలర్‌ మాత్రమేనని చెబుతున్న చంద్రబాబు, సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉందా.. అన్న వైఎస్సార్‌సీపీ సవాల్‌పై మాత్రం ఇప్పటిదాకా స్పందించనే లేదు. చెప్పుకోవడానికి ఏమీ లేక.. ఏం చేస్తారో కూడా చెప్పలేక సతమతమవుతున్న 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే వృద్ధ జంబూకం.. పార్టీ శ్రేణులు పూర్తిగా కకావికలం కాకూడదని సరికొత్త డ్రామాకు తెర తీసింది. అందరం కలిసి సీఎం జగన్‌ను ఓడిద్దాం.. రండంటూ పొత్తులపై ప్రాణాలు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. నిజంగా అసలు సినిమా ముందున్నది చంద్రబాబుకే. ఎందుకంటే.. ఒక్కో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 34 నుంచి 38 శాసనసభ స్థానాలు ఉంటాయి. వాటి పరిధిలో సుమారు 80 లక్షల మంది ఓటర్లు ఉంటారు. ఇందులో సీఎం వైఎస్‌ జగన్‌ సంక్షేమ పథకాల ద్వారా 87 శాతం కుటుంబాలకు చెందిన ఓటర్లకు ప్రయోజనం చేకూరింది. సంవత్సర ఆదాయం పట్టణాల్లో రూ.12 వేలు.. గ్రామాల్లో రూ.10 వేలలోపు ఉంటే ఆ కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్‌) ఉన్నట్లుగా గుర్తిస్తారు. ఆ కుటుంబాలకే సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఓటర్లు సుమారు 2.50 లక్షల నుంచి మూడు లక్షల వరకు ఉంటారు. ఇందులో 80% ఓటర్లు సంక్షేమ పథకాల పరిధిలోకి వచ్చే అవకాశం లేదు. అలాంటి ఓటర్ల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో.. అదీ వామపక్షాలు, పీడీఎఫ్‌, యూనియన్లతో ఒప్పందం చేసుకుని గట్టెక్కడం అన్నది బలం కానే కాదని, వాపు అని అందరికంటే చంద్రబాబుకే బాగా తెలుసు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు కాని మహిళలు, మిగతా వారంతా రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తమకు మేలు చేస్తున్న ప్రభుత్వం కోసం ఏకమైతే టీడీపీ స్థానం ఎక్కడుంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నిజంగా 50కి పైగా నియోజకవర్గాల్లో ఇప్పటికీ అభ్యర్థులే లేరు. మొత్తం 175 స్థానాల్లో టీడీపీకి రెండో స్థానం కూడా సందేహమేనని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. ఈ విషయంపై ప్రజల్లో ఎక్కువ చర్చ జరిగితే టీడీపీ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పక్కదోవ పట్టిస్తూ సరికొత్త రాజకీయ డ్రామాకు తెరలేపారు. ఇందుకు ఎల్లో మీడియా వంత పాడుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రయోగాత్మకంగా పోటీ

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధారణంగా వామపక్షాలు, పీడీఎఫ్‌, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పోటీ చేసేవి. వాటికి ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచే వామపక్షాలు, పీడీఎఫ్‌, బీజేపీ, యూనియన్‌లు క్రియాశీలకంగా పని చేస్తాయి. కొన్ని దశాబ్దాలుగా తమ ప్రభావం ఉన్న వర్గాలనే ఎంచుకుని ఓటర్లుగా చేర్పిస్తున్నాయి.
- అయితే ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ పోటీ చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయపతాక ఎగురవేసింది. మూడు పట్టభద్రుల స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. ప్రథమ ప్రాధాన్యత ఓట్లతో ఎక్కడా గెలవలేదు. కేవలం పీడీఎఫ్‌, సీపీఐ తదితర పక్షాలతో ఓట్ల బదిలీ ఒప్పందం కుదిరిన మేరకు.. ఆ వర్గాలు వేసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గట్టెక్కింది.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను అన్ని వర్గాల ప్రజల అభిప్రాయంగా భావించడానికి ఏమాత్రం వీల్లేదని, ఒకవేళ అలా భావిస్తే తనను తాను మోసం చేసుకోవడమేనన్నది చంద్రబాబుకు కూడా తెలుసని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపడానికే.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు ట్రైలర్‌ మాత్రమేనంటూ చంద్రబాబు బీరాలు పలుకుతున్నారని విశ్లేషిస్తున్నారు.

అన్ని స్థానాల్లో సైకిల్‌ గుర్తు ఉంటుందా?

- వైఎస్సార్‌సీపీని ఎలా ఓడిస్తావ్‌ బాబూ?
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: ఏపీలో 175 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని ఓడిస్తానంటూ ఏప్రిల్‌ 1న (ఫూల్స్‌ డే) టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బీరాలు పలుకుతూ సీఎం వైఎస్‌ జగన్‌ను దూషిస్తూ అలౌకిక ఆనందాన్ని పొందాడని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. అసలు 175 నియోజకవర్గాల్లో సైకిల్‌ గుర్తుపై అభ్యర్థులను పోటీకి పెడతావా? అంటూ నిలదీశారు. మూణ్నెళ్ల క్రితం టీడీపీ నేతలతో సమావేశమై.. 38 నియోజకవర్గాలలో పార్టీకి ఇన్‌ఛార్జ్‌లే లేరంటూ వాపోయిన దిక్కుమాలిన స్థితి చంద్రబాబుదేనన్నారు. 'ముందు ఆ 38 నియోజకవర్గాలకు అభ్యర్థులను వెతుక్కో.. కంగారెందుకు? ఎన్నికలకు మరో ఏడాది ఉంది కదా'అంటూ చంద్రబాబుకు హితవు పలికారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 175 నియోజకవర్గాల్లో పవన్‌ కళ్యాణ్‌కు ఎన్ని ఇస్తున్నావ్‌? బీజేపీలో ఉంటూ టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్‌, ఆదినారాయణరెడ్డి, సుజనా చౌదరి వంటి వారికి ఎన్ని సీట్లు ఇస్తున్నావ్‌?
- పేరుకేమో ఎర్ర జెండా. దాన్ని పసుపు రంగులో ముంచి భుజాన వేసుకుని తిరుగుతూ.. టీడీపీకి సీపీఐని తాకట్టు పెట్టిన నారాయణ, రామకృష్ణలకే సీట్లు ఇస్తావా? ఇంకెవరికైనా ఇస్తావా? ఇంకా రాహుల్‌ గాంధీకి ఎన్ని సీట్లు ఇస్తావ్‌? వీటిపై నీకు స్పష్టత ఉందా?
- ఇంత మందిని పోగేసుకుంటే కానీ సీఎం వైఎస్‌ జగన్‌పై పోటీకి వచ్చే ధైర్యం చంద్రబాబుకు లేదు. అయినా 75 ఏళ్ల వయసులో ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలు, మసిపూసి మారేడుకాయ చేయడం, ఏమార్చటాలు.. ఈ వయసులోనూ బాబు వీడ లేదు.
- 175 చోట్లా పోటీ చేసే దమ్ము లేదు. స్థోమతా లేదు. పది మందిని కలుపుకుంటేగానీ సీఎం వైఎస్‌ జగన్‌పై పోటీ చేసే సాహసం చేయలేని దుస్థితి. కొడుకు కలిసి రాడు. జనం మెచ్చుకోరు. అందుకే దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌, బావమరిది బాలకృష్ణతో తిరిగి.. సినిమా డైలాగ్‌లు రాయించుకుని పంచ్‌ డైలాగులు వదులుతున్నాడు.
- చంద్రబాబు ఎన్ని పార్టీలను పోగేసుకొని వచ్చినా, ప్రజల హృదయాల నుంచి సీఎం వైఎస్‌ జగన్‌ను ఇసుమంత కూడా తొలగించలేరు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం.

కుప్పంలో కార్యకర్త చేతిలో ఓడటం ఎందుకు?

- 'వైనాట్‌ పులివెందుల?' అంటున్నారు కదా.. అలా అనే వారందరినీ నేను ఆహ్వానిస్తున్నాను. పులివెందులలో జగన్‌ గారు ఓడిపోతారని కలలు కనే వారంతా వచ్చి పోటీ చేయండి. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌.. ఎవరైనా సరే పులివెందులలో పోటీ చేయొచ్చు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల చేతిలో ఓడిపోవడం ఎందుకు? పులివెందులలోనే పోటీ చేయండి. అక్కడే ఇద్దరూ పోటీ చేసినా ఫరవా లేదు. మీరో.. మేమో తేలిపోతుంది.
- మొత్తం 21 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే చంద్రబాబు గెలిచింది కేవలం నాలుగు. గ్రాడ్యుయేట్స్‌లో మూడు, ఎమ్మెల్యే కోటాలో ఒకటి.. దానికే చంకలు గుద్దుకోవడం ఏమిటో? ప్రపంచాన్ని జయించినట్లు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నాడు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్‌: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. డీర్‌ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని తిలకించారు. 364 మంది పర్యాటకులు సందర్శించగా, వైల్డ్‌లైఫ్‌ శాఖకు రూ.13,135 ఆదాయం లభించింది. 300 మంది రిజర్వాయర్‌లో బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.10,300 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

- టీఎన్జీవోస్‌ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్‌



మాట్లాడుతున్న అఫ్జల్‌హసన్‌

ఖమ్మం సహకారనగర్‌ : తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి తాము అండగా ఉంటామని టీఎన్జీవోస్‌ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్‌ అన్నారు. ఖమ్మం జెడ్పీ హాల్‌లో ఆదివారం జరిగిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఒకటేనని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. ఉద్యోగ సంఘాల పేరుతో సహచర ఉద్యోగుల నుంచి డబ్బు వసూలు చేసే పద్ధతికి చరమగీతం పాడాలన్నారు. సంఘం పేరుతో, హౌసింగ్‌ సొసైటీల పేరుతో డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఏ, హెచ్‌ఆర్‌ఏ బకాయిలు, సరైన సమయంలో వేతనాలు అందేలా టీఎన్జీవో రాష్ట్ర నాయకులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు బిక్కు, రమణ, టీఎన్జీవోస్‌ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్‌ సాగర్‌, నాయకులు నాగుల్‌ మీరా, కోడి లింగయ్య, వెంకన్న, వసంతరావు, అలీ, బేగ్‌, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

అగ్గితో బుగ్గి కాకుండా..

- అడవిలో అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ దృష్టి
- ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తింపు
- పూర్తి కావచ్చిన ఫైర్‌లైన్ల ఏర్పాటు
- ఫైర్‌ బ్లో బృందాలు కూడా నియామకం



గత ఏడాది అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్‌ ఏర్పాటుచేస్తున్న కూలీలు

పాల్వంచరూరల్‌: వేసవి వచ్చిందంటే మొదటగా గుర్తుకొచ్చేవి అగ్నిప్రమాదాలు. మైదాన ప్రాంతంలో విషయాన్ని పక్కన పెడితే అడవిలో నిప్పు అంటుకుందంటే చాలు కార్చిచ్చులా వ్యాపించి విలువైన అటవీ సంపదతో వన్యప్రాణులకు ముప్పు ఏర్పడుతుంది. ఈ నేపథ్యాన అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి అటవీశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ విస్తీర్ణం 4,28,698 చదరపు కి.మీ.ల మేర ఉండగా.. ఈ పరిధిలో ఆరు డివిజన్లు, 24 రేంజ్‌లు, 944 బీట్లు ఉన్నాయి. వేసవి కాలంలో చెట్ల ఆకులు నేలరాలడం సహజం కాగా.. అడవిలోకి వెళ్లిన వారు బీడీలు, చుట్టలు, సిరెట్లు కాల్చివేయడం ద్వారా నిప్పు అంటుకుని అడవి కాలిపోవడం పరిపాటిగా మారింది. ఈ నేనేథ్యాన జిల్లాలోని అటవీ డివిజన్ల పరిధిలో రూ.73.606 లక్షల కంపా నిధులతో 620 కి.మీ. మేర ఫైర్‌లైన్స్‌ నిర్మాణానికి ఏర్పాట్లు చేపట్టారు. తద్వారా అగ్నిప్రమాదాలను అరికట్టడం.. ఒకవేళ మంట అంటుకున్నా అటవీ సంపదకు ముప్పు వాటిల్లకుండా చూడొచ్చని చెబుతున్నారు.

ఫైర్‌లైన్స్‌ అంటే...

అటవీ ప్రాంతంలో ఎండాకాలం వచ్చిందంటే చెట్ల ఆకులు నేలరాలుతాయి. ఈ సమయాన వంట చెరుకు సేకరణతో పాటు ఇతరత్రా పనులపై వెళ్లే వారు సిగరెట్‌, బీడీ తాగి నిప్పు ఆర్పకుండా పడేస్తే ఆకులు అంటుకుని అడవి మొత్తం మంటలు అంటుకునే ప్రమాదం ఉంది. అందుకే ఎండిన ఆకులను పోగేసి ఓ లైన్‌ ప్రకారం పేరుస్తారు. తద్వారా ఎక్కడైనా మంట అంటుకుంటే ఆ లైన్‌ మేరకే మంట విస్తరిస్తుంది తప్ప పక్కన వెళ్లి చెట్లకు అంటుకునే అవకాశం ఉండదు. కాగా, గతేడాది 868 కి.మీ. ఫైర్‌లైన్స్‌ ఏర్పాటుకు రూ.90.609 లక్షలు వెచ్చించారు. ఈసారి 620 కి.మీ. మేర మాత్రమే ఫైర్‌లైన్స్‌ ఏర్పాటుకు నిర్ణయించగా.. 'కంపా' నిధులు రూ.73.606 లక్షలు వెచ్చించనున్నారు. కాగా, జిల్లాలో ఆరు అటవీ డివిజన్లు ఉండగా.. ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, గుండాల ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశముందని గుర్తించారు.

గిరిజన కూలీలకు ఉపాధి

ఏటా అడవిలో అగ్నిప్రమాదాల నివారణకోసం అటవీ శాఖ ఫైర్‌లైన్స్‌ ఏర్పాటుచేయిస్తుంది. ఈ పనులతో అటవీ ప్రాంత గిరిజనులు వందలాది మందికి దాదాపు నెల పాటు ఉపాధి లభిస్తుంది. కాగా, ఇటీవల నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలతో ఫైర్‌లైన్స్‌ పనులకు అటంకం ఏర్పడినా.. ఇటీవల పనులు వేగవంతం చేసి దాదాపుగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని డివిజన్లలో ఇప్పుడే ఏర్పాటుచేస్తే మళ్లీ ఆకు రాలే అవకాశముందనే భావనతో వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

ఫైర్‌లైన్స్‌ ఏర్పాటు ఇలా..

డివిజన్‌	నిడివి (కి.మీ.ల్లో)	వ్యయం (రూ.లక్షల్లో)
కొత్తగూడెం	75	8.904
ఇల్లెందు	77	9.141
పాల్వంచ	31	3.680
మణుగూరు	129	15.315
భద్రాచలం	83	9.854
వైల్డ్‌లైఫ్‌	225	26.712

ఫైర్‌ వాచర్ల నియామకమేది?

వేసవిలో అడవులకు నిప్పు అంటుకుంటే అధికారులకు సమాచారం ఇచ్చేందుకు గాను ఫైర్‌ వాచర్లను బీట్ల వారీగా ఏటా నియమిస్తారు. కానీ ఈసారి మాత్రం ఇంతవరకు ఫైర్‌ వాచర్లను నియమించలేదు. పాల్వంచ రేంజ్‌ పరిధిలోని సూరారం బీట్‌లో ఇటీవల అటవీశాఖకు చెందిన జామాయిల్‌ తోటలో అగ్నిప్రమాదం జరిగినా.. సమాచారం లేకపోవడంతో సిబ్బంది వెళ్లడం ఆలస్యమైంది. అయితే, నిధుల కొరత కారణంగానే ఫైర్‌వాచర్లను నియమించలేదని తెలుస్తోంది.





అడవిలో మంటను ఫైర్‌ బ్లో ద్వారా ఆర్పేస్తున్న సిబ్బంది (ఫైల్‌)

పనులు పూర్తయ్యాయి



జిల్లాలోని ఆరు అటవీ డివిజన్ల పరిధిలో కంపా నిధులతో చేపట్టిన ఫైర్‌లైన్స్‌ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఎక్కడైనా ఒకటి, రెండు చోట్ల ఉంటే అవి కూడా రెండు, మూడు రోజుల్లో అయిపోతాయి. వేసవిలో ఎక్కువ ప్రమాదాలను జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మణ్‌ రంజిత్‌ నాయక్‌, జిల్లా అటవీశాఖాధికారి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



అభయారణ్యంలో వేసవిలో అగ్నిప్రమాదాలకు కారణం కావొద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అడవికి నిప్పు అంటుకుంటే అరుదైన వన్యప్రాణులు, అటవీ సంపదను కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని అందరూ గుర్తించాలి.

– కె.దామోదర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ, వైల్డ్‌లైఫ్‌ డివిజన్‌

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ ఎంపీ పొంగులేటి డిమాండ్‌



వీరాపురంలో తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చర్ల: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం ఆయన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో పర్యటించారు. చర్ల మండలం కొయ్యూరు, వీరాపురం గ్రామాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి రంగు మారుతోందని, దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని ఒక్కో రైతుకు లక్షల రూపాయల నష్టం వాటిల్లితే రూ.10వేల పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్‌ ప్రకటించడం కంటితుడుపు చర్యేనని విమర్శించారు. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెడుతూ రాక్షస పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌తో రానున్న రోజుల్లో యుద్ధమేనని అన్నారు. అంతకు ముందు కొయ్యూరు, జీపీపల్లి, సత్యనారాయణపురం గ్రామాల్లో పలువురితో మాట్లాడారు. ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించిన ధైర్యం చెప్పారు. మిర్చి కల్లాల్లో పని చేస్తున్న వ్యవసాయ కూలీలతో కాసేపు మాట్లాడిన పొంగులేటి.. వారికి రూ.10,500 ఇచ్చి మీ తమ్ముడిగా, అన్నగా ఇస్తున్న ఈ కానుకతో గాజులు వేయించుకోవాలని అన్నారు. ఆయన వెంట పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు మండలానికి చెందిన పలువురు ప్రముఖులు ఉన్నారు.

ప్రశాంతంగా ఉండండి.. ఫలితాలు సాధించండి

భద్రాచలంటౌన్‌: పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్‌ పొట్రు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి జిల్లాలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. రాత్రి 10 గంటల వరకు, తిరిగి తెల్లవారుజామున 4.30 గంటలకు నిద్ర లేచి చదువుకోవాలని, మనసులో ఎలాంటి ఆందోళన పెట్టుకోకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. పరీక్షకు వెళ్లే ముందు ప్రధానమైన అంశాలను మరోసారి చూసుకోవాలని, ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదివి తప్పులు, కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాయాలని వివరించారు. తెలిసిన ప్రశ్నలకు సమాధానం వెంటనే గుర్తు రాకుంటే తల ఎడమవైపు తిప్పి ఆలోచించాలని సూచించారు. పరీక్షలలో కాపీ కొట్టే ఆలోచనను మనసులోకి రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి



కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు, కార్యకర్తలు

ఇఫ్టూ జాతీయ నాయకుడు సాధినేని

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఐఎఫ్‌టీయూ జాతీయ నేత సాధినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్‌ లక్ష్మీనారాయణ, బెంగాలీ ఉద్యమ నాయకులు అమితాబ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన ఇఫ్టూ రాష్ట్ర మహాసభలో వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రజలకు సుస్థిర పాలనను పక్కనబెట్టి కార్పొరేట్‌ శక్తులైన అదాని, అంబానీల కంపెనీలకు సేవకుడిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హిందూత్వ బ్రాహ్మణీయ ఫాసిస్టు చర్యలను మానుకోవాలన్నారు. నాలుగు లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్‌ కార్మికులను పర్మనెంట్‌ చేయాలని కోరారు. అంతకుముందు పాతబస్‌ డిపో నుంచి కొత్తగూడెం క్లబ్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు వేణుగోపాల్‌, కార్యదర్శి నిర్మల, ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాస్‌, రాసుద్దీన్‌, జె.సీతారామయ్య, ఎల్‌.విశ్వనాథం, బి.రామ్‌సింగ్‌, శ్రీధర్‌, ఎస్‌కే మదార్‌, మేకల రామన్న, నాగరాజు పాల్గొన్నారు.